అప్పు కాదు.. భవిష్యత్తుకు పెట్టుబడి

60 ఏండ్లలో తెలంగాణ అభివృద్ధికి చేసిన ఖర్చు 4,98,053 కోట్లు.. గత పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన ఖర్చు రూ.13,72,930 కోట్లు

- తెలంగాణ వెలుగు జిలుగులను ఎలా ఖరీదు కడతారు?
- అభివృద్ధి ప్రయోజనాలను ఏ విధంగా కొలుస్తారు?
- వృద్ధుల మోముల్లోని చిరునవ్వులకు ఎలా వెల కడతారు?
- స్వేదపత్రం విడుదల చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అస్థిత్వాన్ని పెంచడంతో ఆస్తులు కూడా సృష్టించామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పులు చేసినా ఆ నిధులను భవిష్యత్ తరాల కోసం పెట్టుబడిగా పెట్టిందని వివరించారు. 60 ఏండ్లలో అప్పటి ప్రభుత్వాలు తెలంగాణ అభివృద్ధికి రూ. 4,98,053 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.13,72,930 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఆదివారం తెలంగాణభవన్‌లో స్వేదపత్రం విడుదల చేసిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం అప్పులు చేసిందంటూ ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి తెలంగాణలో మౌలికవసతుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నదని, సాగు, తాగునీరు లేదని, కరెంటు సమస్యలు, కరువులు, వలసలు ఇలా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని గుర్తుచేశారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ప్రేమ్‌అమన్ రూపొందించిన డాక్యుమెంటరీ అనాటి పరిస్థితులకు ఒక తార్కాణమని ఉదహరించారు. తెలంగాణ ఆదాయం నుంచి వచ్చే నిధులను ఇక్కడి అభివృద్ధికే వెచ్చించాలనే ఒప్పందాలను కూడా ఉల్లంఘించి ఆంధ్రాకు మళ్లించిన విషయాన్ని లలిత్‌కుమార్, వశిష్టభార్గవ కమిషన్లే తేల్చిచెప్పాయని పేర్కొన్నారు. అలాంటి సవాళ్ల నడుమ తెలంగాణ పాలనాపగ్గాలను స్వీకరించిన కేసీఆర్.. ఒక్కో రంగంలోని సమస్యలను పరిష్కరించుకుంటూ అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతిని నమోదు చేశారని వివరించారు. తాగు, సాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, లక్షల కోట్లను భవిష్యత్ తరాల కోసం పెట్టుబడిగా పెట్టారని విశదీకరించారు. వాటిని అప్పుగా ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు.

విద్యుత్తు రంగంలో తొమ్మిదేండ్ల ప్రగతి ప్రస్థానం

అంశం	2013-14	2022-23
స్థాపిత విద్యుత్తు	7,778 మెగావాట్లు	19,464 మెగావాట్లు
తలసరి విద్యుత్తు వినియోగం	1,196 యూనిట్లు	2,140 యూనిట్లు
రాష్ట్ర గరిష్ఠ డిమాండ్	5,661 మెగావాట్లు	15,497 మెగావాట్లు
400 కేవీ సబ్‌స్టేషన్లు	6	25
220 కేవీ సబ్‌స్టేషన్లు	51	103
133 కేవీ సబ్‌స్టేషన్లు	176	250
33 కేవీ సబ్‌స్టేషన్లు	2,138	3,200
బోర్ మోటర్ కనెక్షన్లు	19 లక్షలు	28 లక్షలు
కొత్త హైటెన్షన్ లైన్లు	--	11,607 కి.మీ
లోటెన్షన్ లైను	--	1.83 లక్షల కి.మీ
సృష్టించిన ఆస్తుల విలువ		రూ.6,87,585 కోట్లు
అందుకోసం పెట్టిన ఖర్చు		రూ.1,37,517 కోట్లు
వచ్చే ఏడాదికి 26 వేల మెగావాట్లకు విద్యుత్తు స్థాపిత సామర్థ్యం		
భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్		1,080 మెగావాట్లు
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్		4,000 మెగావాట్లు
భూపాలపల్లి కేటీపీపీ థర్మల్ పవర్ ప్లాంట్		600 మెగావాట్లు
సోలార్ విద్యుత్తు ఉత్పత్తి		6,106 మెగావాట్లు

రోడ్లు, భవనాల రంగంలో..

అంశం	60 ఏండ్లలో	6.5 ఏండ్లలో
భవనాల విస్తీర్ణం	30.43 లక్షల స్క్వేర్ ఫీట్లు	102.02 లక్షల స్క్వేర్ ఫీట్లు
4 లైన్ల రహదారులు	485 కి.మీ	669 కి.మీ
2 లేన్ల రహదారులు	6,093 కి.మీ	8,692 కి.మీ

వ్యవసాయ రంగంలో వెచ్చించిన మొత్తాలు

24 గంటల ఉచిత విద్యుత్తు	రూ.36,899 కోట్లు
58.29 లక్షల రైతులకు రుణమాఫీ	రూ.30,000 కోట్లు
70 లక్షల మందికి రైతుబంధు	రూ.73,000 కోట్లు
రైతుబీమా కింద చెల్లించిన ప్రీమియం	రూ.6,861 కోట్లు
1,11,320 కుటుంబాలకు సాయం	రూ.5,566 కోట్లు
తొమ్మిదేండ్లలో ధాన్యం కొనుగోళ్ల విలువ	రూ.1,34,768 కోట్లు
ఇతర పంటల కొనుగోళ్లు	రూ.11,439 కోట్లు
2,601 రైతు వేదికల నిర్మాణం	రూ.572 కోట్లు
విత్తనాలు, ఎరువుల రాయితీ	రూ.982 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణకు	రూ.963 కోట్లు
మైక్రో ఇరిగేషన్‌కు	రూ.2,236 కోట్లు
పంట నష్ట పరిహారం	రూ.1,794 కోట్లు
సివిల్ సప్లయిస్	రూ.23,604 కోట్లు

పట్టణ ప్రగతికి వెచ్చించిన మొత్తం **రూ.1,21,294 కోట్లు**

పల్లె ప్రగతికి వెచ్చించిన మొత్తం **రూ.70 వేల కోట్లు**

వైద్యరంగంలో వెచ్చించిన మొత్తం **రూ. 61,650 కోట్లు**

2014లో సాగు విస్తీర్ణం **1.31 కోట్ల ఎకరాలు**

2023లో సాగు విస్తీర్ణం **2.68 కోట్ల ఎకరాలు**

2014లో ధాన్యం ఉత్పత్తి **68 లక్షల టన్నులు**

2023లో ధాన్యం ఉత్పత్తి **350 లక్షల టన్నులు**

వెలుగులను ఎలా ఖరీదు కడతారు?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులు పెంచిందిఅని చెప్పడానికి ఒక్క విద్యుత్తు రంగమే నిదర్శనమని కేటీఆర్ ఉదహరించారు. తెలంగాణ ఏర్పాటు నాటికి రాష్ట్రంలో కరెంటు పరిస్థితి అందరికీ తెలుసని, లోటు విద్యుత్తు ఉన్నదని వెల్లడించారు. అర్ధరాత్రి కరెంటుతో అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని, వ్యవసాయమే కుంటుపడిపోయిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తాము కరెంటును ప్రాధాన్యరంగాల్లో ఒకటిగా ఎంచుకున్నామని వివరించారు. విద్యుత్తు రంగంలో రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు రూ.1,37,517 కోట్లు పెట్టుబడిగా పెట్టి, రూ.6,87,585 కోట్ల విలువైన ఆస్తులు సృష్టించామని వివరించారు. కొత్తగా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు, సబ్‌స్టేషన్లు, హైటెన్షన్ లైన్ల నిర్మాణం చేపట్టామని, మొత్తంగా స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,464 మెగావాట్లకు పెంచామని, రాబోయే రోజుల్లో అది 26 వేల మెగావాట్లకు పెరగనున్నదని వెల్లడించారు. 2014లో సగటున 6 గంటల కంటే తక్కువ కరెంటు ఇవ్వగా, నేడు 19.20 గంటలకు పెరిగిందని, ఈ విషయాలను ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోనే పొందుపరిచారని తెలిపారు. నాణ్యమైన, 24 గంటల విద్యుత్తు సరఫరాతో వ్యవసాయరంగం ఎంతో అభివృద్ధి చెందిందని, అందుకు 19 లక్షల నుంచి 28 లక్షలకు పెరిగిన మోటర్ కనెక్షన్లే నిదర్శనమని చెప్పారు. విద్యుత్తు సరఫరాతో కార్యనాలు సజావుగా నడిచి ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని, రైతులు ప్రాణాలు కోల్పోకుండా నివారించామని పేర్కొన్నారు. కార్మికులు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపామని, ఆ వెలుగులను ఎలా ఖరీదు కడతారని ప్రశ్నించారు. 'మీరు రాకముందు తాగునీరే లేదా? మీరు రాకముందు నీళ్లేలేవా?' అని కొందరు ప్రభుత్వ పెద్దలు హేళన చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హయాంలో తాగునీటి కార్యక్రమాలు చేపట్టారని, మొత్తం తామే చేశామని అనడంలేదని, అదే సమయంలో గ్రామీణ నీటి సరఫరా మంత్రి నల్లగొండ నుంచే ఉన్నా ఫ్లోరోసిస్ ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దామని వెల్లడించారు.



మెడికల్ కాలేజీలు పెంచడం ద్వారా నిరుపేద విద్యార్థులు కూడా అతితక్కువ ఫీజులతో సీట్లను పొంది ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారని, వారి కుటుంబాల జీవితాలే మారనున్నాయని, దానిని ఎలా లెక్కకడతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో హరిత, గులాబీ, శ్వేత, నీలి, పసుపు ఇలా ఐదు విప్లవాలను సృష్టించామని వివరించారు. పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ఫలితాలకు, అమలు చేస్తున్న పథకాలకు అనేక కేంద్ర సంస్థలు అవార్డులు, ప్రశంసలు కురిపించాయని, వాటిని ఎలా కొలుస్తారని ప్రశ్నించారు. ఇకనైనా అప్పుల ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం చేపట్టిన అనేక నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని, వాటిని పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

తాగునీటి రంగంలో తొమ్మిదేండ్ల ప్రగతి ప్రస్థానం

- రూ.37వేల కోట్లతో మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు
- 58 లక్షల ఆవాసాలకు నల్లాల ద్వారా నీళ్లు
- కొత్తగా 21 ఇంటేక్ వెల్స్
- లక్షా 25 వేల కి.మీ పైపులైన్లు
- 1,255 సర్వీస్ రిజర్వాయర్లు
- 19,233 విలేజ్ ఓవర్ హెడ్ ట్యాంక్‌లు
- 54 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- నల్లగొండ ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- 2014కు పూర్వం 967 ఫ్లోరైడ్ ఆవాస ప్రాంతాలు
- 2020 ఆగస్టు1 నాటికి సున్నా ఫ్లోరైడ్ ఆవాస ప్రాంతాలు



ఆదివారం తెలంగాణభవన్‌లో స్వేదపత్రం విడుదల సందర్భంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్, జీవన్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, కర్నె ప్రభాకర్, అల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

ఆదివారం తెలంగాణభవన్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు. చిత్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మెతుకు ఆనంద్, అరూరి రమేశ్, భేతి సుభాశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజీవ్‌సాగర్ తదితరులు

ప్రాజెక్టులను బద్నాం చేయొద్దు

- పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టుల ప్రధాన పనులన్నీ పూర్తి చేశాం
- కాలువలు తవ్వండి.. నీళ్లివ్వండి
- సీతారామ, చనాక కొరాటను ప్రారంభించండి
- మా పనులను కీర్తించకపోయినా.. కక్ష సాధింపులకు దిగినా ఫర్వాలేదు
- ప్రాజెక్టులపై బురదచల్లొద్దు
- స్వేదపత్రం విడుదలలో కేటీఆర్

స్వేదపత్రంలోని ముఖ్యాంశాలు

- సాగునీటిరంగంలో పెట్టిన ఖర్చు రూ.1,76,000 కోట్లు
- 204 టీఎంసీల సామర్థ్యంతో పలు రిజర్వాయర్ల ఏర్పాటు
- నూతనంగా 50 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆయకట్టు స్థిరీకరణ
- మరో మూడేండ్లలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే పనులు
- దేశంలోనే అత్యధికంగా పెరిగిన భూగర్భజలాలు 6 మీటర్లు
- ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం 4.5 ఏండ్ల రికార్డు సమయంలో పూర్తి
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు వ్యయం రూ.26,738 కోట్లు
- మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లోని 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు
- 1,226 గ్రామాలకు తాగునీరు.. జంటనగరాలకు 50 ఏండ్లకు నీటి భరోసా
- పరిశ్రమలకు అవసరాలకూ నీటి సరఫరా

సీతారామ ప్రాజెక్టు వ్యయం **రూ.8,827 కోట్లు**	చెక్‌డ్యామ్‌ల నిర్మాణం **రూ. 2,314 కోట్లు**
డిండిఎత్తిపోతల వ్యయం **రూ. 2,814 కోట్లు**	మిషన్‌కాకతీయ కింద 21,634 చెరువుల పునరుద్ధరణకు **రూ. 5,464 కోట్లు**

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో లోపాలు ఉంటే ఎలాంటి విచారణైనా చేపట్టవచ్చునని, అందుకు తాము సిద్ధమేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఉద్ఘాటించారు. రాజకీయ స్వప్రయోజనాలకు ప్రాజెక్టులను బద్నాం చేయొద్దని, ప్రాజెక్టులపై బురదచల్లొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరిస్తూ రూపొందించిన స్వేదపత్రం విడుదల సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి ప్రాజెక్టులు పూర్తికాక, సాగునీళ్లు లేక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని గుర్తుచేశారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా నుంచే 14 లక్షల మంది వలస పోయారంటే అనాటి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు తరువాత నిర్దేశించుకున్న ప్రాధాన్యరంగాల్లో సాగునీటిరంగాన్ని కూడా ఒకటిగా ఎంచుకున్నామని వెల్లడించారు. తొలుత మిషన్‌కాకతీయ చేపట్టి చెరువులను పునరుద్ధరించామని, వాగులపై చెక్‌డ్యామ్‌లను నిర్మించామని తెలిపారు. గత పదేండ్లలో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో రూ.1.76 లక్షల కోట్లు వెచ్చించామని వివరించారు. పాలమూరులోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా తదితర పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నాలుగున్నరేండ్లలోనే పూర్తి చేశామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, సీతారామ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన ప్రధాన పనులన్నీ పూర్తి చేశామని వెల్లడించారు. సాగునీటి రంగంలో తాము చేపట్టిన చర్యల ఫలితంగా 50 లక్షల ఎకరాలను స్థిరీకరించామని, మరో 30 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే విధంగా చాలావరకు పనులు పూర్తి చేశామని చెప్పారు. కాలువలు తవ్వి ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

అభినందించకున్నా ఫర్వాలేదు.. నిందించకండి

ఇప్పటికే చనాక-కొరాట, కాళేశ్వరం ప్యాకేజీ-9, ప్యాకేజీ-22 పనులు పూర్తయ్యాయని కేటీఆర్ తెలిపారు. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించి తమ ఖాతాలో వేసుకోవచ్చని అన్నారు. బీఆర్ఎస్ సాధించిన ప్రగతిని, చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అభినందించుకున్నా ఫర్వాలేదని పేర్కొన్నారు. అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క బరాజ్‌లో వాటిల్లిన చిన్న సాంకేతిక లోపాన్ని భూతద్దంలో చూపి ప్రాజెక్టును బద్నాం చేయొద్దని కోరారు.

ఏ విచారణకైనా సిద్ధం

- అసెంబ్లీలో ఎంక్వైరీకి డిమాండ్ చేశాం
- అన్నింటినీ న్యాయంగా ఎదుర్కొంటాం
- ప్రజల కోసం పోరాడుతూనే ఉంటాం
- ఓటమి స్పీడ్ బ్రేకర్ లాంటిది మాత్రమే
- కాంగ్రెస్‌వి ఆరు కాదు.. 412 హామీలు
- బీఆర్ఎస్ తరపున శాఖకో షాడో టీం
- తెలంగాణ ప్రగతిని పడిపోనివ్వం
- 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం
- కేంద్రం కంటే ఎక్కువ జీతాలు ఇచ్చాం
- నిజం గడప దాటేలోపే.. అబద్ధం ఊరంతా తిరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఏ విచారణకైనా, ఏ కమిషన్ అయినా, ఏ రకమైన ఆదేశాలు ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పష్టం చేశారు. సాగునీటిపై చర్చ, శ్వేతపత్రాల విడుదల సందర్భంగానే ఎంక్వైరీకి డిమాండ్ చేశామని గుర్తుచేశారు. తప్పులుంటే బయటపెట్టాలని, అన్నింటినీ న్యాయపరంగా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో స్వేదపత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత మీడియా అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. అధికారం కాంగ్రెసోళ్ల చేతుల్లోనే ఉన్నదని, అధికారాన్ని ప్రజలకు సేవ చేసేందుకు, హామీల అమలుకు వినియోగిస్తారో, కక్ష సాధింపు కోసం వినియోగిస్తారో వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో పోటీచేసిన ప్రతీసారి గెలుస్తామనే ఆశిస్తామని, ఫలితాలు నిరాశపరిచినా బాధ లేదని చెప్పారు. ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, అందుకు కృతజ్ఞతలు అని తెలిపారు. తాము 1.85 శాతం ఓట్ల తేడాతో ఓడిపోయామని, అందులో 7-8 సీట్లు నాలుగైదు వేల ఓట్ల వ్యత్యాసంతో ఓడిపోయాయని వెల్లడించారు. ఇది ఘోర అపజయం కాదని, స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని అన్నారు. ప్రజల కోసం పోరాడుతామని, ప్రతి అంశంపై రివ్యూ చేస్తామని వివరించారు.

ఎంతో చేశాం.. ప్రచారం చేసుకోలేదు

ఉద్యోగులు, యువత విషయంలో ఎంతో చేశామని, కానీ చెప్పుకోలేక పోయామని కేటీఆర్ అన్నారు. 'దేశంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక జీతాలు ఇచ్చాం. దేశంలోనే అత్యధికంగా 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. కానీ, ఆ విషయాలను మేం ప్రచారం చేసుకోలేకపోయాం' అని చెప్పారు. 'నిజం గడప దాటేలోపల.. అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంది' అని పెద్దలు సామెత చెప్తుంటారని, అదే జరిగిందని తెలిపారు. నిరర్థక అప్పులు, ప్రొడక్టివ్ సెక్టార్‌పై పెట్టే పెట్టుబడికి వ్యత్యాసం గమనించాలని సూచించారు. కరోనా ఆర్థిక ప్రతిష్ఠంభన తర్వాత జీతాల విషయంలో కొంత ఇబ్బంది వచ్చిందని, మిగితా సందర్భాల్లో ఏ ఇబ్బందీ లేదని వివరించారు. ఉద్యోగాల విషయంలో యూట్యూబ్‌లో కొందరు బట్టగాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే నివారించలేకపోయామని, తద్వారా కొంత నష్టం జరిగిందని చెప్పారు. దుష్ప్రచారాన్ని సవరించుకోవాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, ఆ రోజే స్పందించి ఉంటే బాగుండేదని వెల్లడించారు. తమ తరపున చిన్న పొరపాట్లు జరిగాయని, సవరించుకొని ముందుకెళ్తామని అన్నారు. ప్రతి గెలుపులో పాఠాలుంటాయని, ప్రతి ఓటమిలో గుణపాఠాలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రతి శాఖకు ఒక షాడో టీం

కాంగ్రెస్ పార్టీ అలవికాని వాగ్దానాలు ఇచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని, ప్రతి హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వందరోజుల్లో చాలా చేస్తామని చెప్పారని, వంద రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభమైందని అన్నారు. మొన్నే నాలుక మడతేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని, డిప్యూటీ సీఎం మాత్రం తాము అలా చెప్పలేదని అన్నట్టు గుర్తుచేశారు. 'ఇట్ల ఎన్నో అంశాలున్నాయి. ఆరు గ్యారెంటీలు కాదు, 412 హామీలున్నాయి. వాటి లెక్క తీశాం. మా పార్టీ తరపున ప్రతి శాఖకు షాడో టీమ్ ఏర్పాటు చేస్తాం. వేరే దేశాల్లో షాడో క్యాబినెట్ అంటారు. అలాంటిదే మా లెజిస్లేచర్‌లో ఏర్పాటు చేసుకుంటాం. తప్పకుండా ఈ ప్రభుత్వ ప్రతిశాఖలో, ప్రతి రంగంలో వీళ్ల పనితీరు, ఏం చేస్తున్నరు? ఏయే నిర్ణయాలు తీసుకుంటున్నరు? వాటన్నింటిని నిశితంగా గమనించి ప్రజలకు వివరిస్తాం. ప్రజల పక్షాన నిలబడతాం. దీపస్తంభంగా మారిన తెలంగాణను ఆరనివ్వం, పడిపోనివ్వం' అని తెలిపారు.

పేదరికాన్ని 16.12 శాతం తగ్గించాం

- తెలంగాణ ఏర్పడినప్పుడు 21.92%.. ఇప్పుడు 5.8%
- ప్రజా సంక్షేమం కోసమే రూ.2,86,230 కోట్ల వ్యయం
- ఆసరా పింఛన్లతో ఎంతో మంది అభాగ్యులకు అండగా నిలిచాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు స్పష్టీకరణ



హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్ర ఏర్పాటు నాటికి తెలంగాణ సమాజం చిన్నాభిన్నమై దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను తొలి ప్రాధాన్యతగా ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యల వల్ల రాష్ట్రంలో పేదరికం 16.12% తగ్గిందని, తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో 21.92 శాతంగా ఉన్న పేదరికం.. ప్రస్తుతం 5.8 శాతానికి దిగివచ్చిందని పేర్కొన్నారు. సంక్షేమంలో స్వర్ణయుగాన్ని తీసుకొచ్చామని, చివరికి కొవిడ్ సంక్షోభ సమయంలోనూ సంక్షేమ కార్యక్రమాలను ఆపలేదని గుర్తుచేశారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, కార్మికులు సహా సబ్బండ వర్గాల కోసం మానవీయకోణంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసం రూ.2,86,230 కోట్లు వెచ్చించిందని గుర్తుచేశారు. విద్యా, వైద్యంతోపాటు సామాజిక భద్రత పథకాలతో భరోసా కల్పించిందని తెలిపారు. ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు, కల్యాణలక్ష్మీ, దళితబంధు, ఎస్సీ సబ్‌ప్లాన్, అంబేద్కర్ భవనాలు, 125 అడుగుల విగ్రహం ఏర్పాటు, టీఎస్ ఫైడ్, 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పంపిణీ కార్యక్రమాలను అమలు చేసిందని చెప్పారు. గిరిజనులకు తండాలు, గూడేల్లో స్వయం పాలన కల్పించిందని, 4 లక్షల ఎకరాల అడవి భూములపై హక్కులు కల్పించిందని, పోడు భూములకు పట్టాలిచ్చి రైతుబంధు మంజూరు చేసిందని, ఆదివాసీ, బంజార భవనాలు, జోడెఘాట్‌లో కుమ్రంభీం గోండు మ్యూజియం తదితర నిర్మాణాలు చేపట్టిందని వివరించారు. 204 గురుకులాలతో మైనార్టీల్లో విద్యా విప్లవం తీసుకొచ్చామని, పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ పథకాలను అమలు చేయడంతోపాటు ఇమాం, మౌజంలకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యధిక జీతాలు ఇచ్చామని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 30% పీఆర్సీ వర్తింపజేశామని, 1.7 లక్షల మంది సఫాయి కార్మికులు, జీహెచ్ఎంసీ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, 54 వేల మంది హోంగార్డుల వేతనాలు పెంచామని, వీఏవోలకు పేస్కేలు ఇచ్చామని, వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.60 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని, ఐటీ రంగంలో 24 లక్షల ఉద్యోగాలు, ఇతర ప్రైవేట్ రంగంలో 15 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. 'మా దృష్టిలో ఆస్తులంటే నిర్మాణాలే కాదు. ప్రజల్లో పెరిగిన జీవన ప్రమాణాలు. దేశానికే తలమానికంగా పెరిగిన రాష్ట్ర ప్రతిష్ట. ప్రతి కుటుంబంలో పెరిగిన ఆత్మవిశ్వాసం. స్వల్పకాలంలోనే మేము సాధించిన రాష్ట్ర సమగ్రాభివృద్ధే తెలంగాణకు అసలైన గొప్ప ఆస్తి' అని కేటీఆర్ స్పష్టం చేశారు. సబ్బండ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అమూల్యమైన ఆస్తులను ఎలా కొలుస్తారని ప్రశ్నించారు.

సబ్బండ వర్ణాల సంక్షేమానికి వెచ్చించిన నిధులు

వర్గం/పథకం	ఖర్చు (రూ.కోట్లలో)
ఆసరా పింఛన్లు	61,000
కల్యాణలక్ష్మి	11,743
కేసీఆర్ కిట్	1,500
ఎస్సీ సంక్షేమం	92,640
ఎస్టీ సంక్షేమం	43,936
బీసీ సంక్షేమం	44,393
మైనార్టీ సంక్షేమం	9,166
సీఎంఆర్ఎఫ్	3,000
దివ్యాంగుల సంక్షేమానికి	10,300
చేనేత రంగానికి ఏటా	1,200
ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు	3,41,000
రజక, నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి	250 యూనిట్ల ఉచిత విద్యుత్తు